# తుంగభద్ర పొంగింది...

జోరుగా వాన కురిసి వెలిసింది. రాత్రి రెండుజాముల వేళ. ఆనాడే దశరా ఉత్సవాలు ముగిశాయి. వివిధ దేశాలనుంచి విజయనగరపు కొలువుకి కానుకలు పట్టుకొనివచ్చిన రాయబారులూ, మహారాజుకి నజర్లు తీసుకొనివచ్చిన సామంతులూ, తమ తమ స్వస్థానాలకి ఆ రాత్రే బయలు దేరుదామనుకున్నారు. సాయంకాలం జరిగిన గొప్ప దర్బారులో, శ్రీకృష్ణ రాయలు, విదేశ రాజప్రతినిధులకీ, తన సామంతులకీ, పండితులకీ, వీరులకీ యథోచితంగా సత్కారాలు చేశాడు.

తలవనితలంపుగా వాన రావడం వల్ల, ప్రయాణాలు పెట్టుకున్న అతిథులంతా, ఆనాటికి ఆగిపోవలసివచ్చింది. నగరంచుట్టూ వేసిన డేరాలన్నీ ఎక్కడివక్కడే నిలబడిపోయాయి.

తుంగభద్రానదికీ, రాయలవారి నగరుకీ మధ్యవున్న స్థలంలో మాత్రం ఎప్పుడూ డేరాలు వెయ్యడం మామూలు లేదు. రాయలవారి నగరులోనుంచి తుంగభద్రానదికి వెళ్ళడానికి, అటువేపు ఒక ద్వారం వుంది. నదికీ, నగరుకీ మధ్య సుమారు ఒక ఫర్లాంగు చదరంలో గుబురుగా పెరిగిన తోటవుంది. ఎల్లప్పుడూ, ఆ నగరు వాకిలిముందు ఒక సైనికుడు పహరా చేస్తుంటాడు. రెండేసిజాముల కొకడు చొప్పున యీ పహరా జవానులు మారుతూవుంటారు.

వానకురిసి వెలియడమూ, శరత్కాలపు చక్కదనంతో చంద్రుడు మళ్ళీ ఆకాశంమీద కనపడడమూ, హఠాత్తుగా చూసేవారికి ఆనందం కలిగించవచ్చును; కాని, ఎక్కుపెట్టిన విల్లుతో, రాజనగరు వాకిలిముందు పహరా తిరుగుతూన్న సైనికుని ప్రాణానికి మాత్రం విసువుగా వుంది వాన రాకుండా వున్నట్లయితే రాత్రి మొదటి జాము అవగానే అతడు ఇంటికి వెళ్ళేవాడు. కాని, మొదటిజాము అవకుండానే వాన జోరుగా ప్రారంభం కావడమూ, నడిరాత్రిదాకా వెలియక పోవడంవల్ల, అతడికి బదులు రావలసిన సైనికుడు రాలేదు. మరొకడు వచ్చి పహరా అందుకొంటేనే తప్ప, అక్కడ

కప్పగంతుల సత్యనారాయణ

వున్న వాకు వెళ్ళిపోవడానికి వీలు లేదు. ఆ సైనికుడు, తన కంటిముందు సముద్రంలాగ కనిపిస్తున్న నీటివంక చూస్తూ పహారా తిరుగుతున్నాడు.

ఆ వాన ఒక్క విజయనగరంమీదనే కాక, పగవనుకూడా కురిసినట్లుంది - తుంగభద్ర నిమిషనిమిషానికీ లావెక్కుతున్నది. ఆ సైనికునికి తుంగభద్ర కనపడదు కాని, అతని ముందున్న తోటంతా, మోకాలి లోతున నీటితో నిండివుంది. ఆ నీరు క్రమేపీ ఎక్కువ అవుతున్నది రాజనగరు ప్రహరీ ప్రక్కకు నీరు పొర్లివస్తున్నది. ఆ సైనికుని చీలమండలు నీటిలో మునిగాయి. నీరు ఎక్కువ అవుతున్నది. ఏమయినా సరే, అతడు మాత్రం అక్కడినుంచి వెళ్ళిపోవడానికి వీలు లేదు. అతనికి బదులు వచ్చేవాడు, వచ్చే జాడ కనపడదు

ఆ సైనికుడు అలాగే పహారా ఇస్తున్నాడు.

"ఉన్నట్టుండి "అబ్బా" అన్న పురుషస్వరమూ, దభాలున నీళ్ళలో మనిషి పడ్డ చప్పుడూ, ఆ సైనికునికి స్పష్టంగా వినపడ్డాయి.

ఎవరో మనిషి నీళ్ళలో పడిపోయాడు. ఆ సైనికునికి ఏమీ తోచలేదు. ఏమి చెయ్యడమా అని ఆలోచిస్తూ ఉండగానే, నీళ్ళలో పడ్డమనిషి కాళ్లు చేతులు విదిలించి కొట్టుకుంటూఉన్నట్టు కూడా చప్పుడు వినపడింది వెంటనేవెళ్లి రక్షిస్తే, ఆ మనిషి బ్రతకవచ్చును. ఆ సైనికుడు ఆలోచించలేకపోయాడు. పహారా వదలిపోతే రాజద్రోహం, వదలకపోతే నిండు ప్రాణం పోతూవుంటే చూస్తూ వూరుకున్నవాడు అవుతాడు.

ఏం చెయ్యడము?

ఆ సైనికుడి తలలో ఏమి ఆలోచనలు రేకెత్తాయో, అతనిని ఏమి ఉద్రేకం ఆవహించిందో కాని, తన స్థానాన్ని వదలి, మోకాలిలోతు నీళ్ళతో నిండివున్న ఆ తోటలోకి సాగాడు. మనిషి కొట్టుకులాడుతూ వున్న చప్పుడు వస్తున్నవైపే అతడు వెడుతున్నాడు. కొంతసేపటికి, ఆ చప్పుడు ఆగిపోయింది. కాని, అంతకు ముందే అతడు నిర్ణయం చేసుకున్న స్థలానికి, ఆ సైనికుడు వెడుతూనే ఉన్నాడు. సుమారు ముప్పాతిక ఫర్లాంగుమేర నీళ్ళల్లో కాళ్ళీడ్చుకుంటూ వెళ్లాడు. అతని కాళ్ళకు మనిషి తగిలాడు. చప్పున వంగి, ఆ సైనికుడు ఆ మనిషిని పైకి ఎత్తాడు.

ఆజానుబాహు విగ్రహం. తెల్లటి వస్త్రాలు బురదమయమై వున్నాయి. చెట్ల ఆకుల సందులోనుంచి పడుతున్న వెన్నెలకాంతులలో ఆ మనిషి రూపు స్పష్టంగా కనపడకపోయినా, అతడెవరో నాగరికుడనిమాత్రం తెలు



స్తోంది. ఆ వ్యక్తికి స్పృహ లేదు. నీళ్లు బాగా త్రాగినట్టున్నాడు.

ఆ సైనికుడు ఆ వ్యక్తిని బుజాన వేసుకొని, అతి కష్టంమీద మోసుకుంటూ, ఆ తోట మధ్యలో వున్న విహారమందిరానికి తీసుకొని వెళ్ళి పొట్టలో నీరు కక్కించుదామని బయలు దేరాడు.

భుజంమీద బరువుతో, మోకాలి లోతుకు మించిన నీళ్ళలో కాళ్ళీడ్చుకుంటూ నడక ప్రారంభించాడు, సైనికుడు. భుజంమీద బరువును మొయ్యడం వల్ల, తల యెత్తి ముందు దారిని చూసుకోడానికి అతనికి వీలు లేకపోయింది అతి భారంమీప, నిమిషమొక యుగంగా కొంతసేపు నడిచే

టప్పటికి అతడు, తోటమధ్యలో వున్న విహారమందిరానికి చేరుకోడానికి బదులు, తోట ఉత్తరపు చివరకు వచ్చేశాడు. అక్కడ నీరు కూడా చాలా తగ్గిపోయింది. పది అడుగులు ముందుకు వేశాడు. అది మెరక. నీరు అప్పుడే ఎక్కుతోంది. చప్పున తన భుజంమీద వున్న మనిషిని నేలమీద పడుకోబెట్టి, పొట్టను రెండు చేతులతోటి నొక్కి నీరు కక్కించాడు. తన తలపాగాను విప్పి, ఆ గుడ్డతో ఆ మనిషి తలా, మొహమూ తుడిచాడు. వంట్లో వేడి పుట్టడానికి, మెడచుట్టూ, గుండెల మీదా తన చేతులతో రాశాడు. కొంత సేపు ఇలా వుపచారం చెయ్యగా, ఆ వ్యక్తి కన్నులు తెరచాడు.

"ఎవరు నువ్వు?" అని నీరసంగా అస్పష్టంగా అడిగాడు ఆ వ్యక్తి.

ఆ సైనికుడు మాట్లాడలేదు. ఆ వ్యక్తి, కొంతసేపు ఏమీ మాట్లాడలేదు. మళ్ళీ అడిగాడు.

"ఎవరు నువ్వు. మనం ఎక్కడ వున్నాము?"

"నేను కోట పహరా సైనికుణ్ని. పద్మరాజు నా పేరు. నువ్వెవరు?" అన్నాడు సైనికుడు

"నేనా, మేము—నేను—ఈ ఊరు కాదు మాది. మనం ఎక్కడ ఉన్నాం," అన్నాడు ఆ వ్యక్తి


"రాజుగారి తోటకు ఉత్తరాన ఉన్నాము. ఇదంతా నగరం బయలు. అరమైలు నడిస్తేనే గాని, నగరపు పడమటబజారు చివరకు చేరుకోలేము. నువ్వు నడవగలవా?" అని అడిగాడు పద్మరాజు.

"మెల్లిగా నడవవచ్చును. నా కుడి కాలులో చాలా పెద్దముల్లు గుచ్చుకున్నది. అంచేత కుంటుతూ నడవాలి," అన్నాడు ఆ వ్యక్తి.

"తుంగభద్ర పొంగుతున్నది. మనం త్వరగా నడిచి మిట్టమీదుగా వూరు చేరకపోతే, మళ్ళీ నీళ్ళలో చిక్కుపడి పోవలసిఉంటుంది," అని హెచ్చరించాడు పద్మరాజు. అతడు, తాను రక్షించిన వ్యక్తి ముఖంవైపు ఆ వెన్నెలలో చూస్తూఉన్నంతసేపూ, తనకు యెక్కడో బాగా పరిచయంగల మనిషిని చూసిన ట్టవుతోంది. కాని, ఆ మనిషి యెవరో మాత్రం గుర్తుకు రావటం లేదు.

ఆ వ్యక్తి నీరసంగా లేచి నిలుచున్నాడు. కాలిలో ముల్లు చాలా బాధ పెడుతున్నట్టుంది కాని, దాన్ని తీసే ఉపకారణాలు ఎవరిదగ్గిరా లేవు. కుంటుతూ, ఆ వ్యక్తి నడుస్తున్నాడు. అతని ప్రక్కనే, ఆ సైనికుడు, అతని భుజం పట్టుకొని, అతణ్ని పడనియ్యకుండా చూస్తూ నడుస్తున్నాడు

దారిలో నడుస్తూ, తాను కోట పహరాను విడిచి రావడమూ, మళ్ళీ అక్కడకు వెళ్ళడానికి వీలులేకపోవ



"ఒరేయ్ కిట్టూ! ఏవిట్రా మోటుసరసం......"

డమూ, మరునాడు తనకు ఏం శిక్ష పడుతుందో తనకే తెలియక పోవడమూ, ఆ వ్యక్తికి చెప్పాడు పద్మరాజు. ఆ వ్యక్తి నీరసంగా ఊఁ కొట్టాడు. వీరిద్దరూ పట్టణంలోకి చేరుకునేటప్పటికి, దశమి చంద్రుడు ఆకాశవిహారాన్ని ముగించేశాడు. పడమటి బజారులో కొంతదూరం నడిచిన తరువాత, "మేము - నేను ఇక్కడ ఏ అరుగుమీదనైనా పడుకొని, తెల్లవారగానే నా విడిది చేరుకుంటాను. నువ్వు మీ ఇంటికి పో. మా— నా ప్రాణం రక్షించావు. నీకు కృతజ్ఞత ఎలా చెప్పాలో నాకు తెలియడం లేదు. ఆఁ, ఇంద-నా జ్ఞాపకార్థం, ఈ ఉంగరం వ్రేలిని వుంచుకో," అని ఆ వ్యక్తి, ఆ చీకటిలో తన ఉంగరం తీసి, ఆ సైనికునికి ఇచ్చాడు. మొదట వద్దన్నా, బలవంతాన ఆ ఉంగరాన్ని తీసుకొని పద్మరాజు తన కుడిచేతి ఉంగరపు వ్రేలికి పెట్టుకున్నాడు.

పద్మరాజు ముందుకు సాగాడు. ఆ వ్యక్తి మాత్రం, ఆ సమీపంలోనే వున్న అరుగు ఎక్కి, తన తడిగుడ్డలతోనే ఆ అరుగుమీద పడుకున్నాడు.

## 2

తెల్లవారి, బారెడు ప్రొద్దెక్కేవరకు, విజయనగరంలో ఎన్నడూ కని విని ఎరుగనంత కలకలంగా ఉంది. ఏ బజారులో చూసినా, ఏ అరుగుమీద

చూసినా ఏ దుకాణంవద్ద చూసినా, నలుగురైదుగురికి తక్కువ కాకుండా జనం చేరి ఏదో వింత విషయాన్ని చెప్పుకుంటున్నట్లుగా మాట్లాడు కుంటున్నారు.

రాజనగరంముందు సుమారు పది వేలమంది జనం గుంపు చేరారు.

మహారాజు శ్రీకృష్ణరాయలు, రాజనగరులో కనపడడంలేదు; ఏమై పోయినారో ఎవరికీ తెలియదు. రాత్రి భోజనా లయినతరువాత, రాజుగారు మేడమీదకు వెళ్ళడం పరిచారికలు చూశారు తరువాత కొంత సేపటికి వాన వచ్చింది. ఎవరి పని వారు చూసు కొని, పడుకున్నారు. రాజుగారు పడక గదిలోకి వెళ్ళివుంటారని అంతా అను కున్నారు. పగలంతా దసరా ఉత్స వాలలో పాల్గొనివుండటంచేత ప్రభువు అలసి, నిద్రపోయారని అంతా అను కున్నారు. తెల్లవారేసరికి నిద్ర లేచి, కసరత్తు, కాలకృత్యాలు తీర్చుకొనే ప్రభువు, బయటికి రాకపోతే, పరి చారకులు శయ్యాగృహంలో చూశారు. ప్రభువు లేడు. వెంటనే అందరూ నాలుగుదిక్కులూ చూశారు. ప్రభువు జాడ కనపడదు. పడకమీద ఎవరూ నిద్రించిన లక్షణాలు కన పడవు. రాజనగరులో కలకలం ప్రారంభమైంది. రాజనగరు కలకలం, నగరంలోకి పాక్కడానికి ఎంత సేపు కావాలి! రాజుగారు రాత్రినుంచీ కన పడడంలేదని వూరంతా గుప్పుమన్నది. ప్రధాని తిమ్మరుసు, రాజనగరుకు వచ్చి ప్రతి పరిచారికనూ, ప్రతి పరి చారకుణ్ణీ ప్రశ్నించాడు. ఎవరికీ ఏమీ తెలియదు. మహారాణులను పలకరించి చూశాడు మహారాజు జాడ తెలియదు.

తిమ్మరుసు కుమారుడు గోపాల రాజు, నగర రక్షకుడు. తండ్రితో పాటు అతడు కూడా, మహారాజు జాడ తెలుసుకోడానికి తగు విచారణ చేస్తున్నాడు. గతరాత్రి, రాజనగరు చుట్టూ, పహరా చేసిన సైనికుల నందర్నీ పిలవమన్నాడు. ఒక్కొక్క రినే విచారించాడు. పద్మరాజు దగ్గ రకు వచ్చేటప్పటికి, కథకు ముడిపడింది. పద్మరాజు, తనకు సంబంధించినంత వరకు రాత్రి జరిగిన సంగతంతా చెప్పాడు. ఒక్కవిషయం మాత్రం దాచిపెట్టాడు, అది, తను రక్షించిన వ్యక్తి తనకు ఇచ్చిన బహుమానం మాట. మిగతా కథ, అంతా తు, చ తప్పకుండా నిజం చెప్పాడు. గోపాల రాయలు పద్మరాజు కథను నమ్మ లేదు. పద్మరాజు తన విధిని ఉల్లం ఘించి, పహరా వదిలి ఇంటికి పోయి ఉంటాడనీ, ఇక, నీళ్ళలో మునిగిన మనిషిని రక్షించడం, మొదలైన కథ అంతా శిక్ష తప్పించుకోడానికి యెత్తు అనీ, గోపాలరాయలు స్థిరపరచు

కున్నాడు. పద్మరాజును, ప్రధానా మాత్యులముందు హాజరుపెట్టాడు.

"నువ్వు, నీళ్ళలోనుంచి కాపాడిన వ్యక్తి ఎవరు?" అని ప్రధానమంత్రి ప్రశ్న.

"ఈ వూరు కాదన్నాడు. నేను ఎక్కువ ప్రశ్నలుకూడా వెయ్యలేదు."

"ఏమి?"

"అతడు ఆయాస పడతాడేమో నని."

"అతడు ఏమైనాడు?"

"పడమటి బజారులో, మేము చీలి పోయినాము. నేను యింటికి పోయి నాను. అతడు ఏ అరుగుమీదనైనా పడుకొని, తెల్లవారగానే తన వూరు పోతానన్నాడు."

"అతడు యిప్పుడీ నగరమున ఉండడని నీ సూచన కదూ?"

"అతడు చెప్పిన దది."

"నీవు మరల, పహరా కేల పోలేదు?"

"నేను మహారాజనగరు దర్వాజ వదలునప్పటికే, నాకు మోకాలు లోతున అక్కడ నీరు వచ్చినది. అప్పటి కింక తుంగభద్ర పొంగుతూనే వుంది. అంచేత, నీటిలో మునిగిపోతానని భయపడ్డాను."

"నీ ప్రాణం రక్షించుకో జూచావన్న మాట!"

పద్మరాజు బదులు పలుకలేదు.

"మహారాజు కనపడని కారణానికి నీ వెంత బాధ్యుడవో నాకు తెలియదు. కాని, పహరాను బదులుసైనికుడు రానిదే విడిచిపెట్టడం విధ్యుల్లంఘనం. దానికి దండన, మరణమే. ఆ విషయమున నేను కనికరింపలేను," అని తిమ్మరుసు గోపాలరాయల వంక చూచినాడు. గోపాలరాయలు పద్మరాజును బైటికి తీసుకొనిపొమ్మని, అచ్చటనే వున్న ఇరువురు సైనికులకు ఆజ్ఞ ఇచ్చాడు.

ఇంతలో రాజనగరు సింహద్వారం వద్ద బ్రహ్మాండమైన కలకలం బయలు దేరింది. నగరులోనుంచి తిమ్మరుసు, ప్రధాన సేనాని తిరుమలరాయలు, నగర రక్షకుడు గోపాలరాయలు బైటికి వచ్చారు. వారి వెనకనే, పద్మరాజు, అతనికి కాపలాగా ఇరువురు సైనికులు ఉన్నారు.

సింహద్వారం ముందు గుమిగూడిన పదివేలమంది 'మహారాజు, మహారాజు' అని ఒక్క గొంతుతో కేకలేస్తున్నారు. గుంపు రెండు భాగాలుగా చీలింది. మధ్య బాట ఏర్పడింది.

బురదపట్టిన వస్త్రాలతో, నీరసంగా కుంటుతూ, విజయనగర సామ్రాజ్యాధినేత శ్రీకృష్ణరాయప్రభువు, కటికి నేలమీద నడచి సింహద్వారం వైపు వస్తున్నాడు. మహారాజుకు బాట వదలిన జనసమూహం, మహారాజు వెనకనే

బాటను మోసివస్తూ, ప్రభువును అనుగమిస్తున్నారు.

ప్రధానామాత్యుడు గబగబ నడిచి మహారాజుకు ఎదురు వెళ్ళి, కౌగలించుకున్నాడు.

తిమ్మరుసు భుజాన్ని ఆనుకొని మహారాజు ముందుకు నడిచాడు. సింహద్వారం వద్దకు వచ్చేటప్పటికి, తిరుమలరాయలు, గోపాలరాయలు, పద్మరాజు, మిగతా సైనికులు, వంగి మహారాజుకు నమస్కరించారు. మహారాజును చూసి, పద్మరాజు తెల్లబోయినాడు తన వ్రేలిన వున్న వుంగరాన్ని చూసుకున్నాడు. రాజముద్రిక. పద్మరాజు శరీరం పులకరించింది.

మహారాజు నగరులోకి ప్రవేశించి, తనతో తిమ్మరుసు మాత్రం వెంట రాగా, అతఃపురంలోకి వెళ్లాడు. మిగతావారంతా, ఇవతల పెద్ద కూటంలో వుండిపోయారు

ఒక గడియలో మహారాజుకు పరిచర్యలన్నీ జరిగిపోయాయి. ప్రభువు కూటంలోకి వచ్చి సింహాసనం మీద ఆసీనుడయాడు. తిమ్మరుసు, తిరుమలరాయలు, గోపాలరాయలు తమతమ స్థానాలలో కూచున్నారు మహారాజుకు ఎదుట పద్మరాజు, మరి కొంత మంది సైనికులు నిలబడివున్నారు.

"అప్పాజీ! నిన్న రాత్రి, భోజనానంతరం మేము తోటలోని విశ్రామ మందిరం వైపు వళ్ళాము. బడలిక వల్ల అక్కడే కొంతసేపు వుండిపోయాము. ఇంతలో వాన వచ్చింది. వాన వెలిసిన తరువాత నగరు చేరుకుందామని ప్రయత్నం చేశాము. కాని, మోకాలిలోతునీళ్ళలో, కాలిలో బలమైన ముల్లు గ్రుచ్చుకున్నది. ఆ ముల్లును లాగివేదామని ప్రయత్నించడంలో, కాలు జారి క్రింద పడిపోయినాము. ఎన్నిసార్లు లేవడానికి ప్రయత్నించినా, భూమి జారుడుగా ఉండడం వల్ల పట్టు చిక్కలేదు. లేవలేకపోయినాము. ఈ లోపల నీరు త్రాగడం సంభవించింది. మాకు స్పృహ తప్పింది. తరువాత కొంతసేపటికి, వెన్నెల కనపడింది. ఆ సైనికుడు మమ్మల్ని రక్షించాడు," అని మహారాజు కృతజ్ఞతాపూర్వకంగా, పద్మరాజు వైపు చూపించాడు.

"ప్రభువులు నన్ను మన్నించాలి. తన స్థానాన్ని వదలిన నేరానికి, ఇంతకు పూర్వమే అతనికి మరణశిక్ష చెప్పాను," అని తిమ్మరుసు విజ్ఞప్తి చేసుకున్నాడు.

"మీ పని మీరు చేశారు– అంతవరకు సమంజసమే కదా! కాని, మా ప్రాణం రక్షించిన ఆ సైనికుడి ప్రాణాన్ని మేము రక్షిస్తున్నాము," అని ప్రభువు అన్నాడు.

పద్మరాజు, ప్రభువుకి సాష్టాంగ



ప్రణామం చేశాడు అతని కన్నులు నీటితో నిండాయి

''పగ్మరాజూ, మా ప్రాణాన్ని రక్షించినప్పటికీ, పహారా సైనికుడుగా నీవు అసర్థుడవని నిన్న రాత్రితో స్పష్ట పడిపోయినది. ఈ రోజునుండి, నీవు పహారా సైనికుడుగా వుండరాదు

"నిన్న రాత్రి నీవు చేసినది, రాజాజ్ఞోల్లంఘనము. కాని, దానిలోనే, రాజు ప్రాణరక్షణ చేసితివి. అందుకు మేము నీకు కృతజ్ఞులము. మా కృతజ్ఞత తెలియజెయ్యడానికి, నిన్ను పద్మపురానికి ఖిల్లేదారుగా నియమిస్తున్నాము," అన్నాడు ప్రభువు.

బైటనుంచి ఒక సైనికుడు లోనికి వచ్చి, "ప్రభువుల దర్శనం మరొక సారి చెయ్యాలని సింహద్వారంవద్దనున్న ప్రజలు కుతూహలపడుతున్నా," రని మనవి చేసుకున్నాడు.

"పదండి" అని మహారాజు లేచాడు.